క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం కలుసుకున్నారు. పుష్ప గుచ్ఛం అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన్ను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు.

యోగా పోటీల నిర్వహణకు రూ.లక్ష అందజేత



కమిటీ ప్రతినిధులకు చెక్ అందజేస్తున్న ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం: యోగా విలేజ్‌లో ఈ నెల 29వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న యోగా పోటీలకు 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన యోగా అసోసియేషన్ ప్రతినిధి గోపిశెట్టి ఆదినారాయణ లక్ష రూపాయలు అందజేశారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులకు సోమవారం చెక్కు అందించారు. పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 6 వందల మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీలో నూతన నియామకాలు

గాజువాక: గాజువాక ప్రాంతానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను ఆ పార్టీలోని వివిధ బాధ్యతల్లో నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. విశ్వేశ్వరయ్యనగర్ కాలనీకి చెందిన కట్టా పద్మను ఉత్తరాంధ్ర మహిళా మోర్చా ఇన్‌చార్జిగా, శ్రీనగర్‌కు చెందిన వత్సవాయి రోహిణిని మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిశోర్ ఉత్తర్వులను జారీ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొండా ఎల్లాజీరావును బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వారు సంబంధిత నాయకులతోపాటు ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్


ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న నేవల్ స్కూల్ విద్యార్థులు

మద్దిలపాలెం: నేవీ స్కూల్ విద్యార్థులు మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో సోమవారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనం అలవర్చుకోవాలని సూచిస్తూ చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. విశాఖలో నవంబర్ 5న జరిగే నేవీ మారథాన్, నేవీ డే వేడుకల్లో భాగంగా ఈ ఈవెంట్‌ను నిర్వహించినట్టు విద్యార్థులు తెలిపారు. నేవీ మారథాన్‌లో ఫుల్ మారథాన్ 42.2 కిలోమీటర్లు కాగా, హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్లు, 10కే రన్, 5కేరన్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు https://www.vizagnavymarathon.run/లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా..

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- కణితి పీహెచ్‌సీలో శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షల అనంతరం మందులు ఎలా వాడాలో వివరిస్తున్న వైద్యురాలు


శిబిరంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాళింగవీధి ప్రజల సౌకర్యార్థం జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూపంలో పేదలకు మేలు చేస్తే.. నేడు ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్య వ్యవస్థలకు జీవం పోస్తున్నారన్నారు. పేదలకు వైద్యసేవలు చేరువ చేసేలా బృహత్తర కార్యక్రమాలను రూపొందిస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేసి, పేదలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రజల జీవనశైలిలో మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని, ఇలాంటి తరుణంలో ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని అన్నారు.

21 వరకు వైద్య శిబిరం

87వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలకు ఈ నెల 21వ తేదీ వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మహిళలు వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ స్వరూపరాణి, మరో నలుగురు వైద్యులు సేవలు అందించారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 262 మంది వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు.

టోకెన్లు లేకున్నా అవకాశం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిని ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది సందర్శించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వైద్య శిబిరాలకు హాజరు కావాలని కోరుతూ టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్లు లేకున్నా కూడా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నిర్వహించే ప్రాంతానికి నేరుగా వెళ్లి వైద్య సేవలు పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో వైద్య సేవలు

అగనంపూడి: ప్రజల చెంతకు వైద్యసేవలు చేర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం వారి హక్కు అన్నారు. రూపాయి ఖర్చు లేకుండా పేదలకు వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వ వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించడం అనేది మన రాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు. ఇటువంటి పథకాలు మిగిలిన రాష్ట్రాల్లో లేవన్నారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, వార్డు నాయకులు సర్వసిద్ధి బొరయ్యనాయుడు, చట్టి తాతారావు, దాడి నూకరాజు, నారపిని అప్పలరాజు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, మాడిశ సత్యనారాయణ, పల్లా చిన్నా తదితరులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


పౌష్టికాహార స్టాల్స్ పరిశీలిస్తున్న అదీప్‌రాజ్


వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

వేల రూపాయలు ఖర్చయ్యేవి



శిబిరంలో అన్ని వైద్య పరీక్షలు చేశారు. ముందుగా వలంటీర్, ఏఎన్‌ఎం మా ఇంటికి వచ్చి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు శిబిరంలో బీపీ, షుగర్ వంటి పరీక్షలతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు కూడా పరీక్షించారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఇదే వైద్య సేవల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే వేల రూపాయలు ఖర్చు అయ్యేవి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా దగ్గరకు వైద్యులను పంపించి ఉచితంగా సేవలు అందించడం బాగుంది. – కొన్నా సాయిమ్మ, కళింగవీధి

దూరాభారం తగ్గింది



కళ్లు మసగ్గా ఉండడంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. వైద్యులు పరీక్ష చేసి కళ్ల జోడు వాడాలని సూచించారు. పైసా ఖర్చు లేకుండా, ఎక్కడికీ తిరిగే పని లేకుండా ఉచితంగా వైద్యం అందించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందించారు. జగన్‌బాబుకు రుణపడి ఉంటాం. – రొంగలి దేవుడమ్మ, కళింగవీధి

గాయత్రీ దేవిగా కనకదుర్గమ్మ


గాయత్రీ దేవిగా దుర్గాలమ్మ


గౌరీదేవిగా శ్రీమహాదుర్గ


విద్యాలక్ష్మిగా శ్రీమహాలక్ష్మి


సరస్వతిగా శ్రీమహాసరస్వతి


గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ


గాయత్రీదేవి అలంకరణలో కన్యాకాపరమేశ్వరి

పెదగంట్యాడ: దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారు సోమవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- 75వ వార్డు సీతానగరంలో దుర్గమాంబ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీరిన దుర్గమ్మను సోమవారం గాయత్రీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నెలకొల్పిన దుర్గాదేవి అమ్మవారిని వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సంగ్రాన నూకరాజు దర్శించుకున్నారు.

గాయత్రీదేవికి గాజుల అలంకరణ

అగనంపూడి: అగనంపూడిలోని దుర్గాలమ్మ వారి ఆలయంలోని దుర్గాదేవి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు, భవానీలు పాల్గొని పూజలు చేశారు.

మహాదుర్గ అమ్మవారికి సంపెంగ పుష్పార్చన

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో శ్రీ మహాదుర్గ అమ్మవారికి సోమవారం సహస్ర సంపెంగ పుష్పార్చన నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీమహాదుర్గ అమ్మవారు పసుపు వర్ణం చీరలో గౌరీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారిని తెలుపు వర్ణం చీరలో విద్యాలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారిని ఆకుపచ్చ వర్ణం చీరలో సరస్వతీదేవిగా అలంకరించి, దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగ దీక్షాధారణ, నవచండీ మండపారాధన, కలశ స్థాపన, చండీ పారాయణ నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నవరసాభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం మహాగణపతి నవగ్రహ సహిత నక్షత్ర హోమం, నవ చండీ హోమం చేశారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


దుర్గాదేవిని దర్శించుకుంటున్న లతీష్

నూకాంబిక ఆలయ శిఖర కలశం ప్రతిష్ట

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు అప్పికొండ ఆర్.హెచ్ కాలనీలోని బొట్టవానిపాలెం గ్రామంలో ఉన్న ఏడు అమ్మవార్ల గుడి జంక్షన్‌లో నూకాంబిక అమ్మవారి ఆలయ శిఖర కలశ స్థాపన, శ్రీ చక్ర యంత్రం ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నూకాంబిక ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి


కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న కన్యా పూజకు వస్తున్న కన్యలు


అన్నపూర్ణాదేవిగా ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

- అమ్మవారికి 102 మంది కన్యల పూజలు

డాబాగార్డెన్స్: కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కురుపాం మార్కెట్ సమీపంలోని ఆలయంలో అమ్మవారిని బియ్యం బస్తాలతో అలంకరించారు. కంకటాల కృష్ణారావు, కుమారి దంపతులు, వారి కుమారులు సతీష్, నవీన్‌కుమార్ బియ్యం బస్తాలను అందించారు.

నేత్రపర్వంగా కన్యా పూజ

సంప్రదాయ వస్త్రాలను ధరించిన 102 మంది కన్యలతో అమ్మవారికి కన్యాపూజ జరిపించారు. పూజ అనంతరం కన్యలు అందరూ శుద్ధ జలంతో కూడిన కలశాలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. దేవాలయం నుంచి పప్పుల వీధి, శివాలయం వీధి మీదుగా అమ్మవారి ఆలయం వరకు ప్రదక్షిణ సాగింది. సాయంత్రం పెన్నం వెంకటరత్నం నేతృత్వంలో సౌందర్యలహరి గ్రూప్‌చే భాగవతం కార్యక్రమం నిర్వహించారు. ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్ కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

'కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలి'


ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ మిత్రపక్షాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్ కార్మికులకు బోనస్ చెల్లింపుపై యాజమాన్యం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. గతేడాది కంటే అదనంగా బోనస్ చెల్లింపుతో పాటు గతేడాది బకాయి రూ.9500 కూడా కలిపి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, మిత్ర పక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీఎండీ అతుల్ భట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

గాజువాక: తోకాడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు చిట్టూరి సూర్యచంద్రశేఖర్‌కు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గాజువాక యూనిట్ ఆధ్వర్యంలో వీల్ చైర్‌తోపాటు అమృతకలశం పేరిట రూ.1000 ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ ఛైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.గోవిందరావు, డి.వి.ప్రసాదరావు, ఎం.వి.సుబ్బరాజు, బలివాడ సత్యారావు, డి.పావని, రవికిశోర్, జి.విజయలక్ష్మి, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి వీల్ చైర్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ట్రాఫిక్ నిబంధనల స్టిక్కర్ల ఆవిష్కరణ


స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. ఈ నెల 21న పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు తెలిపే స్టిక్కర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్ ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 977వ రోజు సోమవారం, స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

నేడు స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ ధర్నా

- బోనస్ చెల్లింపునకు డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. కార్మికులకు దసరా ముందు బోనస్ చెల్లించాలని, గతేడాది పెండింగ్ బోనస్ రూ.9500 చెల్లించాలన్న డిమాండ్లపై ధర్నా చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గోవాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన విద్యుత్ చార్జీలను పెంచిందని సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. పెంచిన చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచడంతో పాటు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజేంద్ర ప్రసాద్, వై.లక్ష్మణరావు, గొలగాని అప్పారావు, కె.కిరీటం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న రామారావు, నర్సింగరావు దంపతులు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డులోని వడ్లపూడి రైల్వే కాలనీ శివాలయం ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతుల చేతులమీదుగా శంకుస్థాపన నిర్వహించారు. వారు మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుతూ శివాలయం ప్రాంగణంలో నూతన అయ్యప్ప ఆలయ నిర్మాణం, ధ్వజస్తంభం, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ట చేయాలని తలపెట్టడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దలాయి అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.